సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం ¦ 16 ¦ ఆగస్టు ¦ 2024



టన్ను చీనీ రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 271 టన్నులు చీనీకాయలు వచ్చాయి.



కిలో టమాట రూ.23
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టం రూ.6 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
36.8°/23.2°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఉక్కపోత కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

కేజీబీవీలో వసతులపై ఆరా



వంట గదిలో సరుకులను పరిశీలిస్తున్న జడ్జి ముజీబ్ పసపల సయ్యద్

గోరంట్ల: ఖాజాపురం సమీపంలోని కేజీబీవీని గురువారం పెనుకొండ అదనపు సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ తనిఖీ చేశారు. వసతి గృహంలో క్లాస్ రూమ్స్‌తో పాటు వంట గది, సరుకులను క్షుణంగా పరిశీలించారు. వసతులు ఎలా ఉన్నాయని విద్యార్థినులను ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే మండల న్యాయ సేవా సమితికి ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ శిరీష, అధ్యాపకులు పాల్గొన్నారు.

కనకాంబరం కేజీ రూ.2,250



మార్కెట్‌కు వచ్చిన పూలను చూపుతున్న వ్యాపారస్తులు

బత్తలపల్లి: కనకాంబరం పూల ధర కనీవినీ ఎరుగని ధర పలికింది. సాధారణ రోజుల్లో కిలో ధర రూ.200 నుంచి రూ.400 పలికేవి. వర్షాల కారణంగా గురువారం మార్కెట్‌కు అర కొరగానే పూలు వచ్చాయి. తొలుత కిలో రూ.1,600తో మొదలైన ధర రూ.2,250కి చేరింది. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పండుగ కావడంతో కనకాంబరం ధర భారీగా పెరిగిందని వ్యాపారులు పురంశెట్టి రవి, బెస్త వెంకటస్వామి తెలిపారు.

మహనీయుల త్యాగాలు ఆదర్శప్రాయం



పుట్టపర్తి కోర్టులో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న జడ్జి రాకేష్, సిబ్బంది

పుట్టపర్తి రూరల్: భారతావనికి స్వాతంత్ర్యం సముపార్జించిన మహనీయుల త్యాగాలు ఆదర్శప్రాయమని పుట్టపర్తి కోర్ట్ సీనియర్ సివిల్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలు కోర్టు ఆవరణలో నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జడ్జి మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలమే నేటి మన స్వాతంత్ర్యమని అన్నారు. జాతి హితంలో భాగంగా న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని వివరించి ప్రజలకు అందుతున్న సేవల మూలంగానే కోర్టుల ప్రతిష్ఠ పెరిగిందన్నారు. న్యాయవాదులు పాటించాల్సిన గురుతర బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు యెదుభూషణ్, శ్రీనివాసులు, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, ఇందిర, రాజగోపాల్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4 రోజులుగా అంధకారం
- సబ్‌స్టేషన్ వద్ద 3 గ్రామాల ప్రజల ఆందోళన



మలమీదపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

గాండ్లపెంట: సాయంత్రమైతే చాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం. తెల్లవారే వరకు అంధకారమే. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి. అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన వినియోగదారులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. అధికారుల తీరును ఎండగట్టారు. మండలంలోని మలమీదపల్లి, అరమడకవారిపల్లి, కరణంవారిపల్లి గ్రామాలు రోజూ సాయంత్రం వేళ ట్రిప్ అవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోతోంది. ఈ విషయాన్ని అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళితే పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు. ఇంకెన్ని రోజులు తాము చీకట్లో బతకాలంటూ పై మూడు గ్రామాల ప్రజలు గురువారం రాత్రి మలమీదపల్లి సబ్‌స్టేషన్‌లో ఆందోళన చేపట్టారు. బిల్లులు కరాఖండిగా వసూలు చేసే అధికారులు విద్యుత్ సరఫరాను సక్రమంగా అందించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సిబ్బంది స్పందిస్తూ లైన్ చెక్ చేసి.. సమస్య ఎక్కడుందో తెలుసుకుని విద్యుత్ సరఫరా మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.

మెరిసిన త్రివర్ణం



- జిల్లావ్యాప్తంగా ఘనంగా వేడుకలు
- పుట్టపర్తిలో స్వాతంత్ర్య వైభవం
- మహనీయుల త్యాగాలు కళ్లకు కట్టిన విద్యార్థులు
- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సవిత

పుట్టపర్తి/ పుట్టపర్తి అర్బన్: త్రివర్ణ పతాకం మెరిసింది. త్యాగధనుల కీర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకున్నారు. మహనీయుల బాటలో పయనిద్దామని ప్రతినబూనారు. గురువారం జిల్లావ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు అంబరమంటాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జెండాను ఆవిష్కరించారు. పుట్టపర్తి సమీపంలోని శిరసాని హిల్స్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందే వేదికపైకి చేరుకున్న కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్ ఎస్పీ రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తదితరులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారులు ప్రత్యేకంగా సిద్ధం చేసిన వాహనంలో పరేడ్ పరిశీలించారు. దేశభక్తిని పెంపొందించేలా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- పోలీసులు, సాయుధ దళాలు, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు.
- పోలీస్ జాగిలాలు మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి వందన సమర్పణ చేశాయి.
- గత ఏడాది కాలంగా చేపట్టిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ శకటాలతో ప్రదర్శన నిర్వహించారు.
- జిల్లాలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- అనంతరం మంత్రితో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లా అధికారులు పరేడ్ గ్రౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన 12 ప్రభుత్వ శాఖల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులను మంత్రి ప్రశంసించారు.
- స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన జిల్లాస్థాయి విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.
- జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 48 మంది అధికారులకు జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారాలు, 424 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. మొత్తం 472 మంది అధికారులు, సిబ్బందికి పురస్కారాలతో గౌరవించారు.



జెండా ఎగురవేస్తున్న మంత్రి సవిత, చిత్రంలో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న



ధర్మవరం జీవనజ్యోతి పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



ప్రణాళికతో జిల్లా అభివృద్ధి

జిల్లా అభివృద్ధికి వంద రోజుల ప్రణాళికతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని మంత్రి సవిత తెలిపారు. విజన్ ఆంధ్రా -2047లో భాగంగా ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్యంతో ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకంగా చేసిన ఐదు కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. రాజముద్రతో ఉన్న పట్టాదార్ పాసు పుస్తకాలు అందజేస్తామని, భూ వివాదాలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వ హయాంలో 416 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సంక్షేమాన్ని అందజేస్తామన్నారు. ఉద్యాన పంటలు, మత్స్య సంపద, విద్యుత్ శాఖ, ఉద్యాన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ, పశు సంవర్ధకశాక, వైద్య, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ హౌసింగ్ ఇలా ప్రతి శాఖ ద్వారా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. చేనేత, జౌళి శాఖల అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పలు పథకాలు అమలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. గత ఏడాది కాలంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, జిల్లాలో జరిగిన అభివృద్ధిని వివరించారు.

- అనంతరం జిల్లాలోని స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులను కలిసి, వారి క్షేమ సమాచారాలు తెలుసుకొని ఘనంగా సత్కరించారు.



సాయుధ దళాల పరేడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి సవిత



పుట్టపర్తి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల మార్చ్‌ఫాస్ట్





బుక్కపట్నం డైట్ కళాశాల, కదిరి డీటీడబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పీఏబీఆర్ @ 1 టీఎంసీ

కూడేరు: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఒక టీఎంసీ నీరు నిల్వ ఉంది. కొన్ని రోజులుగా తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా పీఏబీఆర్‌లోకి 668 క్యూసెక్కుల నీరు చేరుతోంది. తుంగభద్ర జలాలు డ్యాంలోకి సరఫరా కాకమునుపు 0.452 టీఎంసీల నీరు ఉంది. గురువారం నాటికి పీఏబీఆర్ డ్యాంలో 1.059 టీఎంసీల నీరు ఉన్నట్లు డ్యాం ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. శ్రీరామిరెడ్డి, ఉరవకొండ, సత్యసాయి, అనంతపురం, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 55 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



కూడేరు:పీఏబీఆర్

ఏపీఆర్‌ఎస్‌కు అవార్డు గర్వకారణం

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్‌ఎస్ (ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్)కు ఈ ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు వరించింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రాన్ని ఏపీఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ మురళీధర్ అందుకున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన పాఠశాలగా ఏపీఆర్‌ఎస్ గుర్తింపు పొందింది. రాష్ట్రంలోని మొత్తం 51 జనరల్ గురుకుల పాఠశాలల్లో అత్యుత్తమ ర్యాంకులను సాధించినందున అవార్డు దక్కినట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. గతేడాది విద్యా సంవత్సరం ఆరంభంలో ఏపీఆర్‌ఎస్ కొడిగెనహళ్లి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ద్వారా విజయవాడలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నారు. రెండు వరుస విద్యా సంవత్సరాల్లో ఇద్దరు ముఖ్యమంత్రుల చేతుల మీదుగా అవార్డులను అందుకోవడం హర్షించదగ్గ విషయమని ప్రిన్సిపాల్ తెలిపారు.



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పూర్వ ప్రాథమిక విద్యపై నిర్లక్ష్యం



అంగన్‌వాడీ కేంద్రంలో బోధిస్తున్న వర్కర్

- అంగన్‌వాడీ కేంద్రాలకు చేరని పుస్తకాలు

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	12
అంగన్‌వాడీ కేంద్రాలు	2,824
3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల సంఖ్య	41,917

ప్రశాంతి నిలయం: అంగన్‌వాడీ కేంద్రాలపై కూటమి సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య (ప్రీస్కూల్) అందించేందుకు అవసరమైన పుస్తకాలను ఇప్పటికీ పంపిణీ చేయలేదు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు ఆసక్తి చూపడం లేదు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల బలోపేతం, చిన్నారులకు పౌష్టికాహారం సకాలంలో అందించేందుకు అనేక చర్యలు చేపట్టింది. అందులో ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలు అందజేసింది. ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడంతో పేద కుటుంబాల వారు తమ పిల్లలకే అంగన్‌వాడీల్లోనే కాన్వెంట్ తరహా బోధన దొరుకుతుందని ముందుకొచ్చారు.

పాత పుస్తకాలతో నెట్టుకొస్తున్నారు!

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సామర్థ్యలను గుర్తించి వాటికి అనుగుణంగా గత ప్రభుత్వం పీపీ-1, పీపీ-2 కిట్లను రూపొందించి విద్యా విధానాన్ని అమలుచేసింది. మూడు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ డ్రాయింగ్‌కు సంబంధించి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లను అందజేసింది. 4-5 ఏళ్ల లోపు చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను అందజేసేవారు. నేడు పుస్తకాల పంపిణీపై కూటమి సర్కారు ఊసే ఎత్తడం లేదు. చేసేది లేక అంగన్‌వాడీ వర్కర్లు అరకొరగా ఉన్న పాత పుస్తకాలతోనే చదువులు చెబుతున్నారు.

పుస్తకాలు రాగానే అందజేస్తాం



ఈ ఏడాది అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు సంబంధించిన పీపీ-1, పీపీ-2 కిట్లు ఇంకా రాలేదు. ప్రస్తుతానికి పాత పుస్తకాలతోనే బోధన కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం కొత్త పుస్తకాలు పంపిణీ చేసిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అందిస్తాం.

– ఎం.నాగమల్లేశ్వరి, పీడీ, ఐసీడీఎస్





నాటికలో ఆకట్టుకున్న పలు ఘట్టాలు



స్వాతంత్ర్య సంగ్రామంపై సమాలోచనలు

ఆకట్టుకున్న నాటిక

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ విద్యార్థులు 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రశాంతి నిలయంలో నిర్వహించిన 'స్వరాజ్ కి ఓర్' నాటిక ఆకట్టుకుంది. స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య, బాబా రామచంద్ర, సుభాష్ చంద్రబోస్‌ల పోరాట స్ఫూర్తిని నాటిక ద్వారా కళ్లకు కట్టారు. దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించారు. అనంతరం విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

మిద్దె కూలి ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్: మిద్దె కూలడంతో ఇద్దరు గాయపడ్డారు వివరాలు... పెనుకొండ మండలం మరువపల్లి గ్రామానికి చెందిన వడ్డే వెంకటేశులు, వెంకటలక్ష్మి దంపతులు ఇంటి ఆవరణలోని వరండాలో బుధవారం రాత్రి నిద్రించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా నానిన వరండా పై కప్పు అర్ధరాత్రి సమయంలో కుప్పకూలింది. ఘటనలో గాయపడిన దంపతులను స్థానికులు వెంటనే పెనుకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. తీవ్రంగా గాయపడిన వెంకటేశులును తిరుపతికి తరలిచినట్లు సమాచారం.

అహమ్మద్ నగర్‌లో చోరీ

హిందూపురం అర్బన్: స్థానిక అహమ్మద్ నగర్‌లో నివాసముంటున్న రవి ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబసభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి రవి బుధవారం బెంగళూరుకు వెళ్లాడు. గురువారం వేకువజామున దుండగులు తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువా ధ్వంసం చేసి అందులోని రెండున్నర తులాల బంగారు నగలు, 18 తులాల వెండి సామగ్రి, ఇతర విలువైన వస్తువులు, పట్టు దుస్తులు అపహరించుకెళ్లారు. గురువారం ఉదయం 11 గంటలకు ఇంటికి చేరుకున్న రవి... చోరీ జరిగిన విషయం గుర్తించి సమాచారం ఇవ్వడంతో సీఐ రాజగోపాల నాయుడు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: కర్ణాటక నుంచి హిందూపురానికి అక్రమంగా తీసుకు వస్తున్న మద్యాన్ని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన ఎస్‌ఐ హరూన్‌బాషా... సిబ్బందితో కలసి గురువారం మధ్యాహ్నం పట్టణ సరిహద్దులో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 336 టెట్రా ప్యాకెట్ల మద్యం తరలిస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా... రైతు మృతి



పుల్లారెడ్డి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఓ రైతు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం వులేటిపల్లికి చెందిన పుల్లారెడ్డి (68) భార్య పరిమళ, ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక కార్యకర్తగా పుల్లారెడ్డికి పేరుంది. ఆయన భార్య గతంలో చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యురాలిగా పనిచేశారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న పుల్లారెడ్డి... గురువారం తన మడిలో ట్రాక్టర్‌తో దున్నకం చేపట్టాడు. ఆ సమయంలో ఉన్నఫళంగా ట్రాక్టర్ తిరగబడింది. ఇంజన్ కింద చిక్కుకున్న పుల్లారెడ్డిని చుట్టుపక్కల రైతులు వెలికి వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పుల్లారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మంత్రి సవిత చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ (చిత్రంలో) కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న



పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎస్పీ రత్న ఎగురవేసి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రకటించారు. వివిధ శాఖలకు చెందిన 48 మంది జిల్లా అధికారులు, 424 మంది ఉద్యోగులను కలిపి మొత్తం 472 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. వీరందరికీ విశిష్ట సేవా ప్రశంసాపత్రాలను మంత్రి సవిత ప్రదానం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ వి.రత్న తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫోటోగ్రాఫర్, అనంతపురం:



కేఎస్ భాగ్యరేఖ, పుట్టపర్తి ఆర్డీఓ; వెంకటశివారెడ్డి, ధర్మవరం ఆర్డీఓ; ఎం.సన్నీవంశీకృష్ణ, కదిరి ఆర్డీఓ; వైవీ సుబ్బారావు, వ్యవసాయ అధికారి; జి.చంద్రశేఖర్, ఉద్యాన అధికారి; సుదర్శన్, మేనేజర్, ఏపీఎంఐపీ; డి.పద్మమ్మ, పట్టు శాఖాధికారి; ఎన్.శుభదాస్, పశు సంవర్ధక అధికారి



ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, మత్స్య శాఖాధికారి; రవీంద్రనాథ్‌రెడ్డి, అటవీ శాఖాధికారి; మల్లికార్జునరావు, భూగర్భ జల శాఖాధికారి; ఎంఎల్ఎస్ మూర్తి, అగ్రి టేడ్ మార్కెటింగ్; వంశీక్రిష్ణారెడ్డి, సివిల్ సప్లై అధికారి; డాక్టర్ మంజువాణి, డీఎంహెచ్ఓ; తిప్పేంద్రనాయక్, డీసీహెచ్ఎస్; డాక్టర్ రోహిల్‌కుమార్, హిందూపురం



నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ; శివరంగప్రసాద్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి; మోహన్‌రామ్, ఎస్టీ వెల్ఫేర్ అధికారి; నిర్మలజ్యోతి, బీసీ వెల్ఫేర్ అధికారి; విజయప్రసాద్, డ్వామా పీడీ; రమేష్, చేనేత జౌళి శాఖ; యు.మీనాక్షి, డీఈఓ; సంజీవయ్య, ఆర్అండ్‌బీ అధికారి



మురళీమోహన్, పీఆర్ శాఖ అధికారి; మల్లికార్జునప్ప, డ్వామా; విజయకుమార్, డీపీఓ; వెంకటనారాయణ, హౌసింగ్ పీడీ; కరుణసాగర్‌రెడ్డి, రవాణా శాఖాధికారి; శివారెడ్డి, ఎన్ఓ, సచివాలయాలు; కృష్ణానాయక్, కోఆపరేటివ్ ఆఫీసర్; నరసింహరాజు, దేవదాయశాఖ



చాంద్‌బాషా, పరిశ్రమల అధికారి; రామచంద్ర, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్; శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్; రంగస్వామి, ధర్మవరం మున్సిపల్ కమిషనర్; వంశీకృష్ణభార్గవ్, మున్సిపల్ కమిషనర్; విజయ్‌కుమార్, డీఎస్పీ, ఏఆర్; కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం; శ్రీనివాసులు, ధర్మవరం డీఎస్పీ; శ్రీలత, కదిరి డీఎస్పీ; రాజేంద్రనాథ్ యాదవ్, సీఐ; బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, సీఐ, ఎస్‌బీ; రాగిరి రామయ్య, సీఐ; కొండారెడ్డి, సీఐ



రాజ్‌కుమార్, మడకశిర సీఐ; మనోహర్, మడకశిర సీఐ; యుగంధర్, పెనుకొండ సీఐ; మోహన్, కదిరి రూరల్ సీఐ; గురుప్రసాద్, సెబ్ సీఐ; రాజశేఖర్‌గౌడ్, సెబ్ సీఐ; ధీరజ్ రెడ్డి, సెబ్ సీఐ, మడకశిర; శివకుమారి, డీఎల్‌పీఓ, ధర్మవరం; కె.మహబూబ్‌బాషా, ఎస్ఏ, కలెక్టరేట్; మైనుద్దీన్, డీటీ, కలెక్టరేట్; గురుప్రసాద్, డీటీ కదిరి ఆర్డీఓ ఆఫీస్; హరూన్‌బాషా, ఎస్ఐ, హిందూపురం; మల్లికార్జునరెడ్డి, ఎస్ఐ, కనగానపల్లి



నరసింహుడు, పట్నం ఎస్ఐ; బాబ్జాన్, కదిరి టౌన్ ఎస్ఐ; గోపి, లేపాక్షి ఎస్ఐ; ప్రదీప్‌కుమార్, ఎస్‌బీ ఎస్ఐ; తాజ్ మహమ్మద్, హెడ్ కానిస్టేబుల్, కదిరి; నాగాంజనేయులు, ఐటీ కోర్ టీం, పుట్టపర్తి; ఎస్.రమేశ్ కుమార్, కానిస్టేబుల్; కె.తిప్పేస్వామి, హెడ్ కానిస్టేబుల్; కె.రంగానాయక్, హెచ్‌సీ, కదిరి

యువకుడి దుర్మరణం



మృతుడు అల్లాబకాష్ (ఫైల్)

అమడగూరు: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరిలోని నల్లగుట్ట వీధికి చెందిన షేక్ అల్లాబకాష్ (22) ఇటీవల డిగ్రీ పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణకు బెంగళూరుకు వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం బెంగళూరు నుంచి కదిరికి ద్విచక్రవాహనంపై బయలుదేరిన ఆయన... అమడగూరు మండలం బిళ్లూరు రోడ్డులో నారాయణస్వామి మఠం వద్దకు చేరుకోగానే మలుపులో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొన్నాడు. ఘటనలో తలకు తీవ్రగాయమై అల్లాబకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ మగ్బూల్‌బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షాక్‌తో గర్భిణి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామంలో గొల్ల కావేరి (27) అనే గర్భిణి విద్యుత్ షాక్‌కు గురై గురువారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల క్యాతప్ప, యశోదమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. మూడో కుమార్తె కావేరిని కేపీ కుంట గ్రామానికి చెందిన శివన్నకు ఇచ్చి 8 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఒక కుమారుడున్నారు. ఈ క్రమంలోనే కావేరి గర్భం దాల్చింది. ఎనిమిదో నెల గర్భిణి కావడంతో ఇటీవల కాన్పు కోసం పుట్టింటికి వచ్చింది. తండ్రి క్యాతప్ప నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి గురువారం విద్యుత్ మోటార్ సహాయంతో నీటితో క్యూరింగ్ చేసే క్రమంలో విద్యుత్ షాక్ గురైంది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మరణించినట్లు నిర్ధారించారు. విగతజీవిగా పడి ఉన్న కావేరిని చూసి కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. 'వద్దమ్మా అని చెప్పిన వినకపోతివి తల్లీ' అంటూ తండ్రి రోదించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

కదిరి టౌన్: స్థానిక నిజాంవలీ కాలనీ నివాసి షేక్ షబ్బీర్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు షేక్ రఫీక్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. డబ్బు చెల్లింపుల విషయంలో ఈ నెల 13న నానా దర్గా సమీపంలో షబ్బీర్‌పై చెక్క మొద్దుతో రఫీక్ దాడి చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం ఉదయం రాయచోటి రోడ్డులోని రైల్వే పట్టాల సమీపంలో తచ్చాడుతున్న రఫీక్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి చెక్క మొద్దును స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

కణేకల్లు: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాలను బలిగొంది. స్కూలులో స్వాతంత్య్రం దినోత్సవం జరుపుకొని, అదే ఉత్సాహంతో స్నేహితులతో కలిసి వేదవతి హగిరిలో ఈత కొడదామని వెళ్లి గంట వ్యవధిలోనే విగత జీవయ్యాడు. ఈ విషాద సంఘటన కణేకల్లు మండలంలోని మాల్యం గ్రామంలో గురువారం చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మంగలి లక్ష్మీ, అమ్రేష్ దంపతుల కుమారుడు మంగలి రవికుమార్ అలియాస్ రాజేష్ (12) స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. ఉదయం స్కూల్‌లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో రాజేష్ పాల్గొన్నాడు. మధ్యాహ్నం స్నేహితులతో కలిసి వేదవతి హగరి నదిలో ఈత కొడదామని వెళ్లాడు. ఈ క్రమంలోనే గుంతలో మునిగిపోయాడు. అతన్ని కాపాడేందుకు స్నేహితులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వారు అటుగా వెళుతున్న వారికి చెప్పగా, ఓ వ్యక్తి రవిని బయటికి తీశాడు. తల్లిదండ్రులు చికిత్స కోసం కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మూడు రోజుల్లో కుమార్తె పెళ్లి.. గుండెపోటుతో తండ్రి మృతి



రామాంజనేయులు (ఫైల్)

బొమ్మనహాళ్: మూడు రోజుల్లో కుమార్తె పెళ్లి వేడుక ఉండడంతో ఏర్పాట్లలో నిమగ్నమైన తండ్రి ఆకస్మత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. బొమ్మనహాళ్ మండలం బొల్లనగుడ్డం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పూరి రామాంజనేయులు (48) వ్యవసాయ పనులతో జీవనం సాగించేవాడు. భార్య ఆదెమ్మ, కుమార్తె ఐశ్వర్య, కుమారుడు అభిషేక్ ఉన్నారు. ఐశ్వర్యకు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం నిశ్చయమైంది. మరో మూడు రోజుల్లో పెళ్లికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో గురువారం తీవ్ర గుండెపోటుకు గురై రామాంజనేయులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి మృతితో ఐశ్వర్య పెళ్లి ఆగిపోయింది.